
సాక్షి ఒడిశా

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.8.25.297లు, బంగారం 2 గ్రాముల 550 మిల్లీ గ్రాములు, వెండి 6 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



క్రీడలతో ఉజ్వల భవిష్యత్

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజీవ్ లోచన్ సాహు అన్నారు.

- 8లో.



'సుభద్ర' అమలుకు కసరత్తు

పర్లాకిమిడిలో సుభద్ర పథకం అమలుపై జిల్లా అధికారులు కసరత్తు మొదలెట్టారు.

- 8లో.

న్యూస్‌రీల్

వైద్యుడిపై దాడి చేసిన వ్యక్తికి జైలు శిక్ష



కేసు వివరాలు ప్రకటిస్తున్న పీపీ మనోజ్ కుమార్

కొరాపుట్: వైద్యుడిపై దాడి చేసిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించింది. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కేంద్రంలో జేఎంఎఫ్‌సీ కోర్టు ఆవరణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ మనోజ్ కుమార్ మహాపాత్రో వివరాలు ప్రకటించారు. 2015 ఏప్రిల్ 4వ తేదీన రాయిఘర్ సమితి జొడింగ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడు సుధాంశు శేఖర్ విధుల్లో ఉన్నారు. అదే సమయంలో కుసుంపూర్ గ్రామానికి చెందిన బిశ్వజిత్ హల్దర్ తన బంధువుని చికిత్స కోసం తీసుకొచ్చాడు. అయితే చికిత్స పొందుతూ రోగి మృతి చెందడంతో బిశ్వజిత్ ఆగ్రహంతో డాక్టర్‌పై దాడి చేశారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బిశ్వజిత్‌ని అరెస్ట్ చేశారు. ఈ కేసుని విచారించిన జేఎంఎఫ్‌సీ కోర్టు న్యాయమూర్తి ప్రతీష్ కుమార్ చంద్ తన తీర్పుని వెలువరించారు. ముద్దాయి బిశ్వజిత్‌కి 14 నెలల జైలు శిక్ష, రూ.6,000 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

నందన్‌కానన్‌లో 4 సింహం పిల్లల జననం



జన్మించిన సింహం పిల్లలు

కొరాపుట్: రాష్ట్రంలోనే అతిపెద్ద జంతు ప్రదర్శన శాల నందన్‌కానన్‌కి అదనపు అతిథులు వచ్చారు. గురువారం భువనేశ్వర్‌లోని ఈ జూలో ఒక సింహం మరో 4 పిల్లలకు జన్మనిచ్చింది. దీంతో జూలో సింహాల సంఖ్య 25కి చేరింది. సింహం పిల్లలను జూ సిబ్బంది అత్యంత జాగ్రత్తగా సంరక్షిస్తున్నారు. వాటి ఆరోగ్య పరిస్థితిని కాపాడడానికి పశు వైద్య నిపుణులను ఏర్పాటు చేశారు.

బైకు తగలబెట్టిన దుండగులు



దగ్ధమైన ద్విచక్ర వాహనం

రాయగడ: ఇంటి ముందు పార్క్ చేసిన బైకును గుర్తు తెలియని దుండగులు తగలబెట్టారు. జిల్లాలో గుణుపూర్‌లోని మఠిగుడ కెందువీధిలో బుధవారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి గుణుపూర్ ఆదర్శ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు జితేంద్ర చౌదరి ఫిర్యాదు చేశాడు. ఎప్పటిలాగే బుధవారం తన ఇంటి ముందు బైకు పార్క్ చేసినట్లు పేర్కొన్నాడు. అయితే అర్ధరాత్రి సమయంలో దుండగులు బైకును పెట్రోల్ పోసి తగులబెట్టారన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపడుతున్నారు.


గుడారిలో గంజాయి స్వాధీనం




గంజాయితో నిందితులు

రాయగడ: జిల్లాలోని గుడారిలో అక్రమంగా కారులో తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్న సమాచారాన్ని తెలుసుకున్న పోలీసులు ఈ మేరకు దాడులను నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా గుడారి వైపు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా, అందులో 21.800 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు గురువారం తరలించినట్లు గుడారి పోలీసులు వెల్లడించారు.

వికసించిన బొండా మల్లె



- సత్తాచాటిన బొండా జాతి విద్యార్థి
- ఎంకేసీజీలో ఎంబీబీఎస్‌కు ఎంపిక
- వెన్నుతట్టి ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు



Naveen Patnaik

Strong will power and hard work lead to success. Mangala Muduli of Banda valley of Mudulipada of Malkangiri district is a burnin[g] example of this. With his strong will and sincere efforts, he is going to study medicin[e]. This success of Mangala is a source of inspiration for all. Wishing her a bright futur[e]

మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అభినందన

కొరాపుట్/మల్కన్‌గిరి: దేశంలోనే అత్యంత వెనుకబాటుతో ఉంటూ, పురాతన సాంప్రదాయాలతో కొట్టుమిట్టాడుతున్న బొండా జాతిలో విద్యాసూర్యుడు ఉదయించాడు. నీట్ ఫలితాల్లో ఆ ప్రాంతానికి చెందిన విద్యార్థి మంగళ ముదలి సత్తా చాటాడు. అతడు బ్రహ్మపుర ఎంకేసీజీ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదవడానికి ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని స్వయంగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ ప్రకటించడం విశేషం.

బొండా ఘాట్‌పై దృష్టి

బొండా జాతి యువకుడు ఎంబీబీఎస్ సీటు సాధించడంతో ఇప్పుడు యావత్ రాష్ట్రం బొండా ఘాట్‌పై దృష్టి సారించింది. పెద్ద ఎత్తున మీడియా ప్రతినిధులు, అధికారులు మంగళ ముదలి స్వస్థలమైన మల్కన్‌గిరి జిల్లా ఖోయిర్‌పుట్ సమితి ముదలిపాడు గ్రామ పంచాయతీలోని బొండాఘాట్‌లో ఉన్న బొడబెల్ గ్రామాన్ని సందర్శించారు. అతని తల్లిదండ్రులు సంకి ముదలి, హుడు మదలిలకు ఈ విషయం చెప్పగా వారు పెద్దగా స్పందించలేకపోవడం ఆశ్చర్యం. అంతే కాక తమ కొడుకు ఏం చదువుతున్నాడో తమకు తెలియదన్నారు. తల్లి సంకి మాత్రం తన కొడుకు ఏదో సాధించాడని భావించి ఆనందం వ్యక్తం చేసింది. కొడుకు ఎక్కడున్నాడని ప్రశ్నించగా వారికి తెలియక, భువనేశ్వర్ అని తటపటాయిస్తూ చెప్పారు. బొండా జాతి నుంచి మంగళ ముదలి మొట్టమొదటి వైద్య విద్యార్థి కావడం గమనార్హం.

ప్రముఖుల అభినందనలు

బొండా జాతి విద్యార్థి మంగళ ఎంబీబీఎస్ సీటు సాధించడంపై పలువురు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధరేంద్ర ప్రధాన్, రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గొండో తదితరులు అతడిని అభినందించారు. బొండాజాతి ఆధునిక ప్రపంచంలోకి వేసే ముందడుగుగా అభివర్ణించారు.

గురువే దైవమై...

సమాజంలో గురువుల గౌరవం పెంచే ఘటన ఇది. మంగళ బొండాఘాట్‌లో ముదలి పాడ ఉన్నత పాఠశాలలో చదివాడు. అక్కడికి అప్పట్లో ఉత్కళ కేసరి దాస్ అనే వ్యక్తి ఉపాధ్యాయుడిగా వచ్చారు. బొండా జాతి విద్యార్థులను తీర్చిదిద్దేందుకు దృష్టి సారించారు. 8వ తరగతి చదువుతున్న సమయంలోనే మంగళ రాత్రి 12 గంటల వరకు చదువుతుండడం ఆ ఉపాధ్యాయుడు గమనించారు. దీంతో అతడిని ప్రోత్సహించి ప్లస్ 2 మత్తిలిలో చదవడానికి సహకరించాడు. అనంతరం తన స్వస్థలం బాలేశ్వర్‌లో మంగళని ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లో చేర్పించి, తానే వసతి, ఆహారం, ఫీజులు చెల్లించారు. మంగళకి అవసరమైన పుస్తకాలతో సహా అన్ని ఖర్చులు భరించి నీట్ పరీక్ష రాయించారు. కీ ప్యాడ్ ద్వారా మంగళ ఆన్‌లైన్ క్లాసుల్లో పాల్గొనేవాడు. ఈ ఫలితాలు వెల్లడైన తర్వాత బాలేశ్వర్ జిల్లాలో ఉన్న మంగళ మీడియాతో మాట్లాడుతూ తనకు దైవం అంటే ఉత్కళ కేసరి దాస్ మాత్రమేనన్నారు. తన ఇంటికి విద్యుత్ కూడా లేదని, కానీ ఉత్కళ కేసరి తనకు ఫ్యాన్, లైటు ఉన్న గది ఇచ్చి చదువుకోవడానికి ఏర్పాట్లు చేశారన్నారు. తానెప్పుడు ఫ్యాన్ కింద చదువుతానని అనుకోలేదన్నారు. తాను డాక్టరైన తర్వాత బొండా జాతి గిరిజనులకు చదువుపై అసక్తి పెంచుతానన్నారు.



మంగళ నివాసం వద్ద బొడబెల్ గ్రామంలో ఉపాధ్యాయుడు ఉత్కళ కేసరి దాస్ తదితరులు



నీట్‌లో ఉత్తీర్ణత సాధించిన మంగళ ముదలి

ఎవరీ బొండా జాతి గిరిజనులు

ఆధునిక సమాజానికి దూరంగా పురాతన గిరిజన సాంప్రదాయాలు నేటికీ పాటిస్తున్న వారు బొండా జాతి ప్రజలు. కొరాపుట్ జిల్లా లమ్తాపుట్, మల్కన్‌గిరి జిల్లా ఖొయిరిపుట్ సమితుల్లో వీరు అత్యధికంగా నివసిస్తున్నారు. పురాణాలు ప్రకారం దండకారణ్యంలో శ్రీరామ చంద్రుడు అరణ్యవాసం చేసినప్పుడు, సీతాదేవి స్నానం చేస్తుండగా కొందరు గిరిజన మహిళలు చూసి నవ్వారని చెబుతారు. దీంతో ఆగ్రహించిన సీతాదేవి ఈ జాతి మహిళలు వస్త్రాలు ధరించకుండా జీవించమని శపించిందని, అందుకే నాటి నుంచి వారు వస్త్రాలు కాకుండా పూసలతో తయారు చేసిన మాలలను వస్త్రాలుగా ధరిస్తారని చెబుతారు. వీరిలో అప్పర్ బొండా జాతి వారు సమారు 6,700 మంది ఉండగా, వారు ఇప్పటికీ ఆధునిక సమాజానికి దూరంగా ఉన్నారు. లోయర్ బొండాలో సుమారు 17,000 మంది జనాభా ఉన్నారు. వీరు జన జీవన ప్రవంతిలో కలుస్తున్నారు. అయితే వీరి ప్రాంతాల్లోకి అనుమతి లేకుండా ఎవరూ వెళ్లే అవకాశం లేదు.



మంగళ ముదలి తల్లిదండ్రులు సంకి, హుడు మదలిలు



ST & SC Development Departm...
@scstdevdept

Mangala Muduli, a talented student from the Bonda tribe, has achieved an impressive milestone by securing a place in the prestigious MKCG Medical College and Hospital, Berhampur, through NEET 2024. Muduli, who completed his schooling at Mudulipada SSD High School and pursued his higher education at SSD Senior Secondary School in Govindapalli, has been allotted a seat in the MBBS programme. Muduli's allocation in the first round reflects his hard work and dedication. The Odisha Government's ST/SC Department extends its congratulations and best wishes to Mangala Muduli as he embarks on this new journey!

అభినందనలు తెలిపిన రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ

అత్యాచారం నిందితుడికి యావజ్జీవం



జయపురం ప్రత్యేక పోస్కో కోర్టు

జయపురం: కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2022లో ఒక మైనర్ బాలికపై జరిగిన అమానుష అత్యాచారం కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగారంతో పాటు రూ.50 వేలు జరిమానాను జయపురం ప్రత్యేక పోస్కో కోర్టు విధించిందని స్పెషల్ పోస్కో పబ్లిక్ ప్రాసిక్యూటర్ డా.గాయిత్రీ దేవి గురువారం వెల్లడించారు. ఈ కేసులో 13 మంది సాక్షులను విచారించి, 21 డాక్యుమెంట్స్ పరిశీలించి తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు. నిందితుడు లక్ష్మీపూర్ పోలీసుస్టేషన్ పరిధి ప్రాంతానికి చెందిన వాల్మీకి ఉరఫ్ బాలు మార్థగా తెలిపారు. అలాగే బాధితురాలికి రూ.6 లక్షలు ఆర్థిక సాయం అందజేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవా ప్రదీకరణ అధికారులను కోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణలో ఉన్న సమయంలో బాధితురాలికి రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందజేసినట్లు డా.గాయిత్రీ దేవి వెల్లడించారు. ముద్దాయి నుంచి వసూలయ్యే జరిమానా డబ్బు కూడా బాధితురాలికి అందజేయాలని కోర్టు ఆదేశించిందని తెలిపారు. ఒకవేళ జరిమానా చెల్లించకుంటే అదనంగా మరో 6 నెలలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కోర్టు స్పష్టం చేసిందన్నారు.

ఇదీ విషయం...

కేసును పరిశీలిస్తే 2022 ఫిబ్రవరి 6వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో 6 ఏళ్ల బాలిక నిందితుడు బాలు ఇంటి బయట ఆడుకుంటున్నది. ఆ సమయంలో బాలు వచ్చి ఆ బాలికను తన ఇంటిలోనికి తీసుకెళ్లి అత్యాచారం జరిపాడు. ఈ విషయం ఎవరికి తెలిపినా చంపుతానని బాలికను బెదిరించాడు. ఇంటికి వచ్చిన బాధిత బాలిక జరిగిన విషయాన్ని తన తల్లికి చెప్పింది. దీంతో బాలిక తల్లి వెంటనే లక్ష్మీపూర్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. అప్పటి పోలీసు అధికారి కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

పాఠాలు బోధిస్తూ ఉపాధ్యాయుడు మృతి



రంజన్ కుమార్(ఫైల్)

కొరాపుట్: పాఠాలు బోధిస్తూ ఉపాధ్యాయుడు మృతి చెందిన విషాదకర ఘటన కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి టాన్సింగ్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ రంజన్ కుమార్ సతార్ (56) అనే ఉపాధ్యాయుడు కుప్పకూలిపోయాడు. వెంటనే పాఠశాల సిబ్బంది అతడిని పాడువ ప్రభుత్వ వైద్యశాలకి తరలించారు. అయితే అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఉపాధ్యాయుడికి గుండెపోటు రావడంతో చనిపోయినట్లు వెల్లడించారు. ఉపాధ్యాయుడి మృతిపై సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

సంబరులెండిలో వైద్య బృందం పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న వైద్య బృందం

రాయగడ: జిల్లాలోని గుడారి సమితి సంబరులెండి గ్రామంలో రెండు నెలల వ్యవధిలో పది మంది కిడ్నీ రోగులు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో వైద్య శాఖ అప్రమత్తమైంది. ఈ మేరకు ఆ గ్రామంలో ప్రత్యేక వైద్య బృందం బుధవారం పర్యటించింది. జిల్లా అదనపు మెడికల్ అధికారి (ప్రజారోగ్యం) డాక్టర్ మమత సాహు నేతృత్వంలో గుడారి పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ అరూప్ నంద నాయక్, డీబీఎల్ఎం అరవింద పారిడ, ససిటి సుభాష్ బెహరలతో పాటు గుడారి సమితి అధ్యక్షురాలు లక్ష్మీ సాబొరొలు సంబరులెండి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో అనారోగ్యంతో ఉన్న కొంతమందిని వైద్య బృందం పరీక్షించింది. అయితే ఈ గ్రామంలో ఇంతవరకు ఎవరూ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించుకోలేదని వైద్య బృందం గుర్తించింది. ఏదైనా అనారోగ్యం వస్తే వైద్యులను సంప్రదించకుండా సమీపంలోని ప్రైవేట్ క్లీనిక్‌లు, మెడికల్ షాపుల్లో సంప్రదించి గ్రామస్తులు చికిత్స చేసుకుంటున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ గ్రామంలో ఎవరికీ కిడ్నీ సంబంధిత రోగాలు లేవని ప్రాథమిక నిర్ధారణలో స్పష్టం చేశారు. కేవలం హిమోగ్లోబిన్ తగ్గడం వలనే అనారోగ్యాలు పాలవుతున్నట్లు గుర్తించారు. అయితే ప్రస్తుతం గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించి, అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని డాక్టర్ సాహు వెల్లడించారు.

బైక్ దొంగల ముఠా గుట్టురట్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో తపస్వినీ కహార్

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొరిగుమ్మ పోలీసులు బైక్ దొంగల ముఠా గుట్టురట్టు చేశారు. గురువారం బొరిగుమ్మ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలీసు అధికారి కేసు వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది మే 20వ తేదీన బొరిగుమ్మ మహంతి వీధిలో అద్దెకు ఉంటున్న టి.రాణి దొర ఇంట్లో దొంగతనం జరిగింది. ఆ ఇంట్లో ఒక స్కూటీతో పాటు అల్మారా పగలుగొట్టి 150 గ్రాముల వెండి నగలు, ఒక టేబుల్ ఫ్యాన్ దొంగిలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇలాగే మూడు నెలల్లో అనేక బైక్‌లు దొంగిలించబడిన కేసులు నమోదయ్యాయి. దీనిలో భాగంగా ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు బొరిగుమ్మ సబ్ డివిజన్ పోలీసు అధికారి తపస్వినీ కహార్ వెల్లడించారు. అరెస్టైనవారిలో బొరిగుమ్మ పోలీసుస్టేషన్ పరిధి బొడొదుబిలి గ్రామానికి చెందిన అనిల్ హరిజన్, జయపురం సదర్ పోలీసుస్టేషన్ పరిధి సొరాగుడ గ్రామానికి చెందిన ధనపతి నాగ్, కుంద్ర సమితి లిమా గ్రామానికి చెందిన సజన హరిజన్‌లు ఉన్నట్లు వెల్లడించారు. ఈ కేసులో మరో నలుగురు నిందితులు ఉన్నారని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని వెల్లడించారు. వీరి నుంచి 13 మోటారు బైక్‌లు స్వాధీనపరచుకున్నట్లు తెలిపారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న వినియోగదారులు

కొరాపుట్:

విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పట్టణంలో విద్యుత్ వినియోగదారులు టాటా పవర్ విద్యుత్ సంస్థ కార్యాలయాన్ని గురువారం ముట్టడించారు. తమ అనుమతి లేకుండా ఇళ్లకి స్మార్ట్ మీటర్లు అమర్చారన్నారు. దీనికిప్రతినెలా రూ.60 అద్దె వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అద్దె చెల్లించే మీటర్లు తమకు అవసరం లేదన్నారు. తక్షణమే మీటర్లు తొలగించాలని డిమాండ్ చేశారు. సంస్థకు అవసరం ఉంటే వారే అద్దె చెల్లించుకోవాలని సూచించారు. ఆ భారం వినియోగదారుడు మీద వేస్తే సహించమని స్పష్టం చేశారు. అనంతరం కార్యాలయానికి వినతిపత్రం అందజేశారు.

నాటుసారాపై ఉక్కుపాదం



నీలాగుడ ప్రాంతంలో సీజ్ చేసిన సామగ్రి

జయపురం: సమితిలోని సమీప ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అక్రమంగా తయారవుతున్న నాటుసారాపై ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. జయపురం ఎక్సైజ్ సిబ్బంది, సదర్ పోలీసులు సంయుక్తంగా నీలాగుడ, ఉమ్మరి తదితర ప్రాంతాల్లో గురువారం దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా పెద్ద ఎత్తున నాటుసారాతో పాటు సారా తయారీకి సిద్ధం చేసిన ఊటను స్వాధీనం చేసుకున్నట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్రతండి వెల్లడించారు. దాడుల్లో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అరెస్టైనవారిలో నీలాగుడ గ్రామానికి చెందిన అభి హరిజన్, మున్నాభాయి సింగ్, ఉమ్మిరి గ్రామానికి చెందిన త్రిలోచన పూజారి, ధనుర్జయ మఝిలు ఉన్నట్లు తెలిపారు. నీలాగుడ సారాబట్టీలపై దాడులు నిర్వహించి 3,700 లీటర్ల ఊట, 185 లీటర్ల నాటుసారా పట్టుకొని ధ్వంసం చేశామన్నారు. అలాగే మున్నా నిర్వహిస్తున్న బట్టీపై దాడి జరిపి 20 లీటర్ల నాటుసారా, 2 వేల లీటర్ల ఊట పట్టుకొని నష్టపరచినట్లు వెల్లడించారు. అదేవిధంగా ఉమ్మరి ప్రాంతంలో ఇద్దరు నిందితులు నిర్వహిస్తున్న బట్టీపై దాడి జరిపి 19 లీటర్ల నాటుసారాతో పాటు, 2 వేల లీటర్ల సారా వంటకానికి సిద్ధం చేసిన ఊటను పారబోసినట్లు తెలిపారు. ఆయా సారా బట్టీల్లో సారా వంటకానికి వినియోగించే సామాగ్రి సీజ్ చేశామన్నారు. దాడుల్లో జయపురం ఎక్సైజ్ విభాగ డిప్యూటీ సూపరింటెండెంట్ స్వాగతిక మహంతి, ఎక్సైజ్ అధికారి శశికాంత దత్త తదితరులు పాల్గొన్నారు.



అరెస్టైన అభి హరిజన్



అరెస్టైన త్రిలోచన పూజారి



అరెస్టైన ధనుంజయ మఝి



ఉమ్మరి ప్రాంతంలో సీజ్ చేసిన సామగ్రితో సిబ్బంది

క్లుప్తంగా

'ఆపరేషన్ కగార్'పై నిరసన గళం



కుమారన్న వర్ధంతి సభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

పలాస: ఆపరేషన్ కగార్ పేరుతో దేశంలో ఆదివాసీలను అంతమొందించే కుట్రలను ప్రజలు తమ సంఘటిత ఉద్యమాల ద్వారా ప్రతిఘటించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ పిలుపు నిచ్చారు. పలాస మండలం బొడ్డపాడు అమర వీరుల స్మారక మందిరం వద్ద విప్లవ పోరాట యోధులు కుమారన్న, సీతారాంల 26వ వర్ధంతి సభ వాల్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం పోరాడుతూ పోలీసు కాల్పుల్లో 26 ఏళ్ల క్రితం లొత్తూరు కొండల్లో కుమారన్న సీతారాములు అమరత్వం పొందారని సెప్టెంబరు 10న లొత్తూరు పంచాయితీ పెదగంతరులో జరగనున్న వారి సంతాప సభను విజయవంతం చేయాని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గొరకల బాలకృష్ణ, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పోతనపల్లి మల్లేశు, ఆర్.మాధవరావు, జె.అప్పయ్య, బర్ల గోపి,కామేశు, జానకమ్మ, సరస్వతమ్మ, ముఖలింగం లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

'డ్రోన్ సేవలను రైతులు వినియోగించుకోవాలి'



డ్రోన్‌కు సంబంధించి కోరమండల్ సంస్థ తరపున బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం రూరల్: డ్రోన్ సేవలను రైతులు వినియోగించుకోవాలని కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రెసెడెంట్ జీవీ సుబ్బారెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం రాగోలు వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన వ్యవసాయ యాంత్రీకరణలో మేళాలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. రైతులకు ఉపయోగపడే డ్రోన్లు, దిప్పాలు, కోత యంత్రాలు, ఇతర అత్యాధునిక వ్యవసాయ పరికరాలను ప్రదర్శించినట్లు చెప్పారు. ప్రధానంగా కోరమండల్ సంస్థ నిర్వహిస్తున్న డ్రోన్ సేవలను మహిళా రైతులు వినియోగించుకుంటున్నారని తెలిపారు. వీటితోపాటు ఎరువులు వ్యవసాయ యంత్రాల కంపెనీలు కూడా తమ అత్యాధునిక ఉత్పత్తులను ప్రదర్శించినట్లు ఆయన వెల్లడించారు.


రామకృష్ణాపురంలో చోరీ



దొంగతనం జరిగిన గదిలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

జలుమూరు: అంధవరం పంచాయతీ పరిధి రామకృష్ణాపురంలో దొంగతనం జరిగింది. ఈ దొంగతనంలో మూడు తులాల బంగారం, కొంత నగదుతోపాటు వెండి పోయినట్లుగా భావిస్తున్నారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రేగాన కృష్ణమూర్తితో పాటు కుటుంబ సభ్యులు ఇటీవల బూర్జ మండలం సుంకరి పేట గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం ఇంటికి వచ్చి చూసేసరికి వెనక భాగం తలుపులు తీసి ఉంది. బీరువా తాళాలు తెరిచి బట్టలు చెల్లాచెదురుగా పడేసి ఉండడం గమనించారు. దీంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందజేశారు. అయితే దొంగతనం ఈ మూడు రోజుల్లో ఎప్పుడు జరిగిందన్నది పోలీసులు నిర్ధారణకు రాలేకపోతున్నారు. శ్రీకాకుళం క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించింది. కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బెండి వరహాలు (ఫైల్)

కోటబొమ్మాళి: కస్తూరిపాడు పంచాయతీ గంగుపేట గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎలమంచిలి గ్రామానికి చెందిన బెండి వరహాలు(63) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరహాలు పశువుల వ్యాపారం చేస్తుంటారు. గురువారం తమ గ్రామానికి చెందిన మామిడివలస మల్లేసుతో కలిసి ద్విచక్రవాహనంపై పశువులు కొనేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా.. గంగుపేట వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బండి అదుపు తప్పి రోడ్డు పక్కన గల గుంతలో పడ్డారు. ఈ ప్రమాదంలో వరహాలు తలకు తీవ్రగాయమైంది. 108 వాహనంలో రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలోనే చనిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఆంధ్రా-ఒడిశా మధ్య ఇసుక ర్యాంపు రగడ

- వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన రెండు రాష్ట్రాల అధికారులు
- దిమ్మిడిజోల ర్యాంప్ స్థలం ఒడిశాదేనంటూ వాదన
- మ్యాప్‌లు చూపించలేక మౌనంగా ఉన్న ఆంధ్రా అధికారులు



ఇసుక ర్యాంప్ నిర్వహించిన స్థల మ్యాప్‌లను పరిశీలిస్తున్న ఉభయ రాష్ట్రాల అధికారులు

భామిని: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంమైన భామిని మండలం దిమ్మిడిజోల వద్ద వంశధార నదీ తీరంలో నిర్వహించిన ఇసుక ర్యాంప్ వివాదం పరిష్కారానికి రెండు రాష్ట్రాల అధికారులు గురువారం సంయుక్తంగా పరిశీలించారు. ఆంధ్రా తరపున పాలకొండ ఆర్డీఓ వి.వి.రమణ, డీఐఓ వెంకటరావు, మైన్స్ ఏజీఎం కుమారస్వామి హాజరయ్యారు. ఒడిశా నుంచి గజపతి జిల్లా సబ్ కలెక్టర్ అనూక్ పండా, తహసీల్దార్ అశోక్ ప్రధాన్, మైనింగ్ ఆఫీసర్ ఖిపిన్ పారిదాలు పాల్గొన్నారు. గతంలో ఒడిశా ప్రభుత్వ అనుమతులతో నడిపిన ఇసుక ర్యాంప్ స్థలం ఒడిశాదేనని ఆ రాష్ట్ర అధికారులు ఆధారాలు చూపి వాదించారు. 1994లో జరిగిన ఒడిశా సెటిల్‌మెంట్ మ్యాప్‌లలో వంశధార నది ఈవల వరకు ఒడిశా జిరాయితీ భూములున్నట్టు మ్యాప్‌లతో చూపించారు. బాలేరు, దిమ్మిడిజోల రైతులకు చెందిన భూముల్లో ఇసుక ర్యాంప్ ఉందని ఆంధ్రా అధికారులు వాదించారు. సంబంధిత రికార్డులు చూపిస్తామని ఒడిశా అధికారులకు తెలియజేశారు. ఆధారాలు చూశాక తుది నిర్ణయానికి వస్తామని ఆంధ్రా అధికారులు తెలిపారు. గతనెల 28 తేదీన సాలికిరి రైతుల అభ్యంతరాలతో దిమ్మిడిజోల ర్యాంప్‌లో ఇసుక తవ్వకాలు నిలిపి వేసిన సంగతి తెలిసిందే.

కార్యక్రమంలో భామిని తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, సర్వేయర్ రాజేశ్వరరావు, ఆర్ఐ ఎస్.రాంబాబు, ఒడిశా పోలీస్ బృందం, లివిరి, దిమ్మిడిజోల, సాలికిరి రైతులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు వెళ్లండి



నవీన్ పట్నాయక్‌తో రమేష్ మజ్జి తదితరులు

- నబరంగ్‌పూర్ నాయకులు నవీన్ దిశా నిర్దేశం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా బిజూ జనతా దళ్ పార్టీ నాయకులు ప్రజల వద్దకు వెళ్లాలని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం నవీన్ పట్నాయక్ దిశా నిర్దేశం చేశారు. గురువారం సాయంత్రం రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో నవీన్ నివాస్‌కి నబరంగ్‌పూర్ జిల్లా నాయకులు తరలి వెళ్లారు. ఇటీవల రాయిఘర్ సమితి చైర్మన్ ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థి గుప్త ప్రసాద్ జంకర్ విజయం సాధించారు. ఈ నేపథ్యంలో గుప్త ప్రసాద్‌తో కలిసి పార్టీ శ్రేణులు నవీన్‌ని కలుసుకున్నారు. దీంతో ఈ విజయానికి కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ రమేష్ చంద్ర మజ్జిని నవీన్ అభినందించారు. నవీన్‌ను కలిసినవారిలో డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు లిఫికా బొరయి, డబుల్ గొండో తదితరులు ఉన్నారు.

'సుభద్ర' అమలుకు కసరత్తు



సుభద్ర పథకంపై చర్చిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సుభద్ర పథకం' హామీ అమలుపై జిల్లా అధికారులు కసరత్తు మొదలెట్టారు. దీనిపై కలెక్టర్ తన కార్యాలయం హాల్‌లో అధికారులతో గురువారం సమావేశమయ్యారు. పథకం దరఖాస్తులు సీడీపీవో కార్యాలయం, అంగన్‌వాడీ, జనసేవ కేంద్రాల్లో లభిస్తాయని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జత చేయాలన్నారు.

సుభద్ర పథకం అమలుకు నోడల్ అధికారిగా డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గుణనిధి నాయక్‌కు బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో జిల్లా పరిషత్ అధికారి పృథ్వీరాజ్ మండల్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, జిల్లా సామాజిక సురక్షా అధికారి మనోరమా దేవి, జిల్లా పంచాయతీ అధికారి అశోక్ కుమార్ పట్నాయక్, డీఈవో మాయాధర్ సాహు, జిల్లా లీడ్ బ్యాంకు మ్యానేజర్ మహేశ్వర మండల్ తదితరులు పాల్గొన్నారు.

జింకపిల్లకు గాయాలు



గాయపడిన జింకపిల్ల

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా సమితి లుహాగుడి అటవీ ప్రాంతం నల్లాఘాట్ అటవీ సెక్షన్ వద్ద దారితప్పిన జింకపిల్లను వీధి కుక్కలు గాయపరచడంతో గ్రామస్తులు రక్షించారు. అనంతరం దానిని అటవీ అధికారులకు అప్పగించారు. వారు ప్రాథమిక చికిత్స చేసి అటవీ శాఖ కార్యాలయంలో ఉంచారు. కోలుకున్న తర్వాత మోహనా వద్ద గోవిందపూర్ లేళ్ల పార్కులో సంరక్షణార్థం వదిలిపెడతామని అటవీ అధికారి (మోహనా) లక్ష్మీ ప్రసాద్ బిసాయి తెలియజేశారు.

చోరీకి గురైన బైక్ అప్పగింత



దొరికిన బైక్‌తో వెంకటేష్

కొరాపుట్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో పని చేస్తున్న పి.వెంకటేష్ డీఎన్‌కే కాలనీలో నివాసముంటున్నాడు. బుధవారం రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి కాంపౌండ్‌లో ఉంచి పడుకున్నాడు. అయితే గురువారం ఉదయం లేచి చూసేసరికి ఎవరో బైక్ దొంగలించి తీసుకెళ్లిపోయారు. దీంతో సమీప ప్రాంతాల్లోని సీసీ టీవీల్లో పరిశీలించినా ఎక్కడా ఆచూకీ లభ్యమవ్వలేదు. ఇక చేసేదేమీలేక కొరాపుట్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చాడు. అయితే ముందు రోజు అర్ధరాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా వారికి ఒక బైక్ కనిపించింది. దానిని తెచ్చి పోలీస్‌స్టేషన్ ఉంచారు. అదృష్టవశాత్తు ఆ బైక్ వెంకటేష్‌ది కావడంతో పోలీసులు అప్పగించారు. ఫిర్యాదుకు ముందే బైక్ స్వాధీనం కావడంతో బాధితుడు ఆనందం వ్యక్తం చేశాడు.

కేంద్రీయ విశ్వ విద్యాలయం 16వ వార్షికోత్సవం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ చక్రధర్ త్రిపాఠి తదితరులు

కొరాపుట్: జిల్లాలోని సునాబెడలో ఒడిశా కేంద్రీయ విశ్వ విద్యాలయం 16వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు ప్రకటించారు. ఈ సంస్థ మరింత అభివృద్ధి సాధించాలని సందేశం పంపించారు. మరోవైపు రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, యూజీసీ చైర్మన్ ఎం.జగదీష్ కుమార్‌లు కూడా తమ సందేశంలో సంస్థ అభివృద్ధికి సహకరిస్తామని పేర్కొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వీసీ చక్రధర్ త్రిపాఠి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ట్రైబల్ మ్యూజియం, లైబ్రరీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పశ్చిమ బంగా రాష్ట్ర మాజీ డీజీపీ బీఎస్ రమేష్, భారత అల్యూమినియం కేంద్రం (నాల్కో) దమంజోడి డైరక్టర్ నిరంజన్ సామల్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



రాయగడ: ర్యాలీ ప్రారంభిస్తున్న అతిథులు

కొరాపుట్: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజీవ్ లోచన్ సాహు అన్నారు. నబరంగ్‌పూర్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి ఉన్నా, సరైన అవకాశాలు లేకపోవడంతో ముందుకు సాగలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న క్రీడాభివృద్ధి పథకాలను గ్రామీణ ప్రాంతాల్లోకి తీసుకెళ్లే బాధ్యత సీనియర్ క్రీడాకారులపై ఉందన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి ప్రహ్లాద్ త్రిపాఠి, ఉపాధ్యక్షుడు ఎం.బాల కృష్ణారావు, మనోజ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లతో పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మా మంగళ మందిరం వరకు కొనసాగింది. కార్యక్రమంలో జిల్లా అదనపు మేజిస్ట్రేట్ భాస్కర రైతా, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి, జిల్లా క్రీడా శాఖ అధికారి షేక్ ఆలీనూర్, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: స్థానిక ఇండోర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సీడీఎం డా.గుణనిధి నాయక్, జిల్లా ముఖ్య విద్యాధికారి డా.మాయాధర్ సాహు, జిల్లా క్రీడాధికారి (ఇన్‌చార్జి) ప్రాణకృష్ణ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.



కొరాపుట్: క్రీడా దినోత్సవం వేదికపై అధికారులు



పర్లాకిమిడి: మాట్లాడుతున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

జయపురంలో కుండపోత



వీధుల్లో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు



జలమయమైన ఎంజీ రోడ్డు



26వ జాతీయ రహదారిపై వాహనాలు

జయపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా జయపురం సబ్ డివిజన్‌లో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. పట్టణంలోని మెయిన్ రోడ్డు, ఎంజీ రోడ్డు, నీలకంఠేశ్వర మందిర మార్గంతో పాటు ఆదర్శనగర్, కుంభారి సాహి, నెహ్రూనగర్, శ్రీరామనగర్, పారాబెడ తదితర ప్రాంతాల్లో వరదనీరు ప్రవహించింది. బొడొపొడ నదిపై ఉన్న కల్వర్టుపై వరద నీరు ప్రవహించడం వలన వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే 26వ జాతీయ రహదారి హరడాపుట్- కుసిమి మార్గంలో భారీ వర్షాలు కారణంగా కల్వర్టులు కొట్టుకుపోయాయి. కోట్‌పాడ్ సమితిలోని కుసిమి తదితర ప్రాంతాల్లో రహదారులపై పెద్ద ఎత్తున వరద నీరు ప్రవహించడం వలన ఆ మార్గంలో బుధవారం రాత్రి వాహనాలు నిలిచిపోయినట్లు సమాచారం.

పర్లాకిమిడి: అల్పపీడనం వల్ల గజపతి జిల్లాలో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి వర్షాలు కురుస్తున్నాయి. అత్యధికంగా పర్లాకిమిడిలో 11.44 మి.మీ వర్షపాతం, అత్యల్పంగా గుమ్మా ఏజెన్సీలో 2.0 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా కొరాపుట్, నవరంగ్‌పూర్, రాయగడ, గజపతి జిల్లాల్లో రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు పడతాయని గోపాల్‌పూర్ వాతావరణశాఖ అధికారి బాలికృష్ణ త్రిపాఠి తెలిపారు.



హరడాపుట్-కుసిమి మార్గంలో కొట్టుకుపోయిన కల్వర్టు



కోట్‌పాడ్ మార్గంలో కల్వర్టుపై ప్రవహిస్తున్న వరద నీరు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి సభ్యులు

పర్లాకిమిడి: స్థానిక మార్కెట్ జంక్షన్ వద్ద లక్ష్మీ మెడికల్ హాల్‌లో చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి ఆధ్వర్యంలో ఘనంగా తెలుగు భాష దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య సమితి అధ్యక్షుడు పి.ఆనందరావు మాట్లాడుతూ.. ఇక్కడి ప్రవాసాంధ్రులు తెలుగు భాషను పరిరక్షించాలని కోరారు. అనంతరం చైతన్య న్యాయ సలహాదారు, ప్రభుత్వ పీపీ, వీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ.. గిడుగు రామ్మూర్తి పంతులు పర్లాకిమిడి ప్రాంతంలో వ్యవహారిక భాష కోసం పాటుపడ్డారని, పర్లాకిమిడి మహారాజా కళాశాలలో తెలుగు పండితులుగా కొంతకాలం పనిచేశారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బరాటం నాగేశ్వరరావు, పైడిశెట్టి సుధ, మురళి తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో వలస కార్మికుడు మృతి



శివ మజ్జి

కవిటి: మండలంలోని బొరివంకకు చెందిన శివ మజ్జి అనే నిరుద్యోగ యువకుడు దుబాయ్‌లో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు. ఆరు నెలలు క్రితం స్నేహితుడు బిసాయి మోహన్ తో కలసి దుబాయ్ వెళ్లాడు. ఇద్దరు వేర్వేరు చోట్ల కంపెనీల్లో పనులు చేసుకుంటున్నారు. బుధవారం రాత్రి శివ పని చేస్తున్న కంపెనీలో జరిగిన ప్రమాదంలో శివ మజ్జితో పాటు బీహార్ కు చెందిన యువకుడు మృతి చెందారు. ఈ విషయాన్ని కంపెనీ యాజమాన్యం స్నేహితుడు మోహన్ బిసాయికి తెలపడంతో గురువారం ఉదయం కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో బొరివంకలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వచ్చే ఏడాది పెళ్లి చేసుకోబోయే కొడుకు అర్ధంతరంగా తనువు చాలించాడు అంటూ తల్లి ఊర్మిళ మజ్జి రోదించారు. శివ చిన్నతనంలోనే తండ్రి జగన్నాథం మృతి చెందగా, తమ్ముడు ప్రసాద్ ఉన్నాడు. ఇచ్ఛాపురానికి చెందిన ఓ ప్రైవేట్ సంస్థ ద్వారా ఆ యువకుడు విదేశానికి వెళ్లడంతో.. అతడి కుటుంబ సభ్యులు ఇచ్ఛాపురంలోని ఆ సంస్థ కార్యాలయ సిబ్బందిని ప్రశ్నించారు. వారు సమాధానం చెప్పకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దుబాయ్ నుంచి మృతదేహాన్ని తెచ్చేందుకు గ్రామస్తులు ప్రయత్నిస్తున్నారు.

రైలు ప్రమాదంలో ఒడిశా యువకుడు దుర్మరణం



మరణించిన ఒడిశా యువకుడు

కాశీబుగ్గ: కోటబొమ్మాళి రైల్వేస్టేషన్ పరిధిలోని రైలు పట్టాలపై ఒడిశాకు చెందిన యువకుడు మరణించిన సంఘటన గురువారం జరిగింది.

మృతుడిని ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా గురండి బ్లాక్ పరిధిలో కొర్సండ గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు. ముప్పై ఐదేళ్ల వయసు ఉంటుందని, మరణానికి గల కారణాలు తెలియాల్సి ఉందని జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పలాస జీఆర్పీ ఎస్‌ఐ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపులతో మహిళ ఆత్మహత్య



సంఘటనా స్థలాన్ని తహసీల్దార్‌తో కలసి పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నరసన్నపేట: స్థానిక శ్రీనివాస అపార్ట్‌మెంటు నాలుగో ఫ్లోర్‌లో బుధవారం అనుమానాస్పదంగా మృతి చెందిన వివాహిత అనూరాధ.. ఆత్మహత్య చేసుకున్నట్టుగా పోలీసులు నిర్ధారించారు. భర్త, అత్త,మామలు వరకట్నం కోసం వేధించడంతో అనూరాధ ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు భావిస్తున్నారు. గురువారం పలాస డీఎస్పీ శ్రీనివాసరావు నరసన్నపేట తహసీల్దార్ సత్యనారాయణతో కలసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనూరాధ తల్లి ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ వెంట నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

స్టేట్ బ్యాడ్మింటన్ పోటీలకు ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న ఏపీ రాష్ట్ర స్థాయి జూనియర్స్(అండర్-19) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ పేర్కొన్నారు.

శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీ ఇండోర్ స్టేడియం వేదికగా గురువారం సాయంత్రం జిల్లా బ్యాడ్మింటన్ సంఘ చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, వ్యాపారవేత్త, బ్యాడ్మింటన్ సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి నారాయణశెట్టి వెంకట కిరణ్‌కుమార్ తదితరులతో కలిసి స్టేట్‌మీట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సాగర్ మాట్లాడుతూ దాదాపు రూ.7లక్షల అంచనా వ్యయంతో ఈ బ్యాడ్మింటన్ జూనియర్ స్టేట్ మీట్‌ను నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించినట్టు చెప్పారు. తొలి రోజు 3వ తేదీన క్వాలిఫైయింగ్ రౌండ్స్ జరుగుతాయని, మిగిలిన మూడు రోజులు (4 నుంచి 6వ తేదీ వరకు) మెయిన్ డ్రా పోటీలు జరుగుతాయన్నారు. పోటీలకు కిమ్స్ హాస్పటల్ డైరెక్టర్, సంఘ చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, వ్యాపారవేత్త, బ్యాడ్మింటన్ సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్‌వీ కిరణ్‌కుమార్ ఆర్థికంగా బాసటగా నిలిచేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. స్టేట్ టోర్నీలో క్రీడాకారులతోపాటు మొత్తం 250 మంది ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు చెప్పారు. వీరికి స్థానికంగా వసతి, భోజన ఏర్పాట్లు కల్పిస్తున్నట్టు చెప్పారు.

క్లుప్తంగా

క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం కావాలి

- ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు



ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వర రావును సన్మానిస్తున్న సెంచూరియన్ వీసీ పీకే మహంతి తదితరులు

నెల్లిమర్ల రూరల్: ఒలింపిక్ క్రీడల్లో రాణించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర రావును వర్సిటీ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతో కృషి చేస్తే ఆశించిన ఫలితాలు వస్తాయని చెప్పారు. క్రీడాకారులకు ప్రభుత్వం తగినంత ప్రోత్సాహం అందించాలని కోరారు. వర్సిటీ వీసీ పీకే మహంతి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొంటే శారీరక, మానసిక దారుఢ్యం మెరుగుపడుతుందన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, డీన్‌లు సన్నీడయోల్, విజయబాబు, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో మాస్టర్స్ తండ్రీకూతుళ్లు



తైక్వాండోలో మాస్టర్స్ సాధించిన వేణుగోపాల రావు, యశస్విని

విజయనగరం: ఆత్మరక్షణ విద్య తైక్వాండోలో విజయనగరం జిల్లాకు చెందిన తండ్రీకూతుళ్లు మాస్టర్స్ సాధించారు. ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో గల కేల్గాం స్టేడియంలో 112 వ అంతర్జాతీయ తైక్వాండో మాస్టర్ కోర్స్, 62వ పూందాన్ ఎగ్జామినర్ కోర్స్ నిర్వహించారు. ఈ కోర్సుకు ప్రపంచ తైక్వాండో హెడ్‌క్వార్టర్స్ ఆఫీసర్, చీఫ్ ఆఫ్ వరల్డ్ తైక్వాండో అకాడమీ గ్రాండ్ మాస్టర్ జైవన్ కాంగ్, తైక్వాండో మాస్టర్స్ యూనియన్ గ్రాండ్‌మాస్టర్ వ్యవస్థాపక అధ్యక్షుడు హాంగ్ కిమ్‌లు హాజరయ్యారు. వారి పర్యవేక్షణలో జరిగిన కోర్సులో విజయనగరం జిల్లాకు చెందిన రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు, కుమార్తె సీహెచ్ యశస్విని పాల్గొన్నారు. వేణుగోపాల రావు ఇంటర్నేషనల్ మాస్టర్, హోమ్ దాన్ ఎగ్జామినర్‌గా అర్హత సాధించగా..యశస్విని ఇంటర్నేషనల్ మాస్టర్‌గా అర్హత పొందారు. మొట్టమొదటిసారిగా విజయనగరం నుంచి తండ్రీకూతుళ్లు ఈ అర్హత సాధించడం గర్వకారణమంటూ జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, చైర్మన్ సుభాష్ చంద్రబోస్, అవనాపు విజయ్‌లు వారికి అభినందనలు తెలియజేశారు.

పికప్ వ్యాన్ నుంచి జారిపడి వ్యక్తి మృతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పి.ఆమిటి జంక్షన్ సమీపంలో ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డులో పికప్ వ్యాన్ నుంచి జారిపడి గవరమ్మపేట గ్రామానికి చెందిన దినసరి కూలీ బోగిల సింహాచలం (35) మృతిచెందాడు. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. రోజు కూలీ సింహాచలం సమీప గ్రామస్తుల(కన్నపుదొర వలస)తో కలిసి కాంక్రీట్ పనులకు వెళ్తుంటాడు. ఈ క్రమంలోనే గురువారం కూడా పికప్ వ్యాన్‌లో వెళ్తుండగా పి.ఆమిటి జంక్షన్‌కు చేరుకోగానే ఫిట్స్ రావడంతో వ్యాన్ నుంచి జారి కింద పడిపోయాడు. దీంతో వ్యాన్‌కు కట్టిన మిల్లర్ సింహాచలం శరీరంపై ఎక్కిపోవడంతో తీవ్ర గాయాల య్యాయి. హుటాహుటిన అక్కడి వారు క్షతగాత్రుడ్ని భద్రగిరి సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటనపై ఎల్విన్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

అందుబాటులో బ్యాంకింగ్ సేవలు

విజయనగరం అర్బన్: బ్యాంకు సేవలు అన్నివర్గాల వారికి చేరువయ్యేలా ఆయా బ్యాంకు యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. విజయనగరం చినవీధిలో ఆధునీకరించిన బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచిని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకుల ఆధునీకరణతో ఖాతాదారులకు మెరుగైన సేవలందుతాయన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా డిప్యూటీ జనరల్ మేనేజర్ పీఎం పఠాన్ మాట్లాడుతూ నగరంలో తమ బ్యాంకుకు మూడు బ్రాంచిలున్నట్టు చెప్పారు. తమ బ్యాంక్ ద్వారా గృహ, వాహన రుణాలను తక్కువ వడ్డీకే అందిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ మెహర్‌చైతన్య పాల్గొన్నారు.

పదిమంది గంజాయి నిందితుల అరెస్ట్

- 24 కిలోల గంజాయి, నగదు, బైక్‌లు స్వాధీనం
- నిందితుల్లో నలుగురు జువైనల్స్
- ఎస్పీ వకుల్ జిందాల్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: జిల్లాకేంద్రం విజయనగరం రైల్వేస్టేషన్ సమీపంలో పాత క్వార్టర్స్ వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురు జువైనల్స్‌తో సహా పదిమంది నిందితులను అరెస్ట్ చేసి, 24 కిలోల గంజాయి, ఒక స్కూటీ, రూ.1,390 నగదును రికవరీ చేసినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. విజయనగరం పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు, ఒడిశాకు చెందిన వారితో కలిసి విజయనగరం రైల్వేస్టేషన్ సమీపంలోని పాత రైల్వే క్వార్టర్స్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్సై నవీన్ పడాల్, సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి దాడులు చేసి, రైల్వేక్వార్టర్స్‌లో అనుమానాస్పదంగా ఉన్న పదిమందిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వారిలో నలుగురు జువైనల్స్ కూడా ఉన్నారని, వారందరి దగ్గర నుంచి 24 కిలోల గంజాయి, ఒక స్కూటీ, రూ.1,390 నగదు పోలీసులు రికవరీ చేసి విచారణ చేపట్టారన్నారు. విచారణలో విజయనగరంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన బేత లల్లూ (ఎ1), పడమటి బలిజ వీధికి చెందిన తాలాడ దుర్గాప్రసాద్ (ఎ2), పూల్‌బాగ్‌కు చెందిన పెనుగొండ తేజస్వరూప్ (ఎ3),లతో పాటు వరంగల్ క్రిస్టియన్ కాలనీకి చెందిన గడే సుమంత్ అలియాస్ చిన్నూ, ఒడిశాలోని కొరాపుట్ జిల్లా మలిపుట్‌కు చెందిన త్రినాథ్ ఖోరా, ఉత్తరప్రదేశ్‌లోని జాతవ జిల్లా సపాయి గ్రామానికి చెందిన సంతోష్ జాతవ్ అలియాస్ రాజ్‌పాల్ జాతవ్‌లతో పాటు నలుగురు జువైనల్స్ ఉన్నారన్నారు. నిందితులందరూ గంజాయి పీల్చడం, విక్రయించడానికి అలవాటుపడ్డారని చెప్పారు. సుమత్, శ్రీనాథ్, సంతోష్‌లు గంజాయిని ఇతర రాష్ట్రాల నుంచి విజయనగరం తీసుకువచ్చి ఇక్కడ స్థానికంగా ఉంటున్న బేతలల్లూ, తాలాడ దుర్గాప్రసాద్, తేజస్వరూప్‌లకు విక్రయిస్తారన్నారు. వారు పట్టణంలో గంజాయి అవసరం ఉన్న వారికి , చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయించే వారికి అమ్ముతుంటారన్నారు. అంతేకాకుండా నిందితులు చెడు వ్యసనాలకు అలవాటు పడి మొబైల్స్, మోటారు సైకిల్స్‌ను కూడా చోరీ చేస్తుంటారని తెలిపారు. విచారణలో తాలాడ దుర్గాప్రసాద్‌పై 12 క్రిమినల్ కేసులతో పాటు రౌడీహిస్టరీషీట్ కూడా ఉందన్నారు. అదేవిధంగా పెనుగొండ తేజస్వరూప్‌పై ఎనిమిది క్రిమినల్ కేసులున్నాయన్నారు. వీరంతా ఒక గ్రూప్‌గా ఏర్పడి తరచూ గంజాయి పీలుస్తూ, నేరాలకు పాల్పడడం అలవాటుగా మార్చుకున్నారన్నారు. గంజాయి కేసులో సూత్రధారులతో పాటు, చిన్న మొత్తాల్లో విక్రయించే వారిని, గంజాయి పీల్చే వారిని కూడా అరెస్ట్ చేశామని వివరించారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడినా, విక్రయించినా, వినియోగించినా కఠినంగా వ్యవహరిస్తున్నామని, అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఈ కేసులో క్రియాశీలక పాత్ర పోషించిన వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్సై నవీన్ పడాల్, నరేష్, హెచ్‌సీ ఎం. అచ్చిరాజు, కానిస్టేబుల్స్ ఎస్.మణికంఠ, టి.శ్రీని వాస్, పి.శివశంకర్, ఎన్.గౌరీశంకర్‌లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఎస్పీ సీఐ కేకేవీ విజయనాథ్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

- క్రీడాకారులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



వ్యాయామ ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్‌లను సత్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం: ఏ వ్యక్తి అయినా జీవితంలో ఎదుగుదల సాధించాలంటే క్రమశిక్షణతో పాటు, ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హితవు పలికారు. ముఖ్యంగా క్రీడాకారులకు ఇది ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు స్థానిక రాజీవ్ ఇండోర్ స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, విద్యాశాఖ, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ, జిల్లాకు గొప్ప పేరు సంపాదించి పెట్టిన క్రీడాకారులు, కోచ్‌లను అభినందించారు. లక్ష్యాన్ని చేరుకునేవరకు విశ్రమించకూడదని సూచించారు. జిల్లాలో క్రీడలను అభివద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ప్రకటించారు. క్రీడాభివద్ధికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని చెప్పారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి జిల్లాకు, రాష్ట్రానికి గొప్ప పేరు తేవాలని ఆకాంక్షించారు.

క్రీడాకారులకు సత్కారం

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా, అర్జున అవార్డు గ్రహీత, అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారుడు శీర జయరాంతో పాటు జిల్లాకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ క్రీడాకారులు మత్స సంతోషి(వెయిట్ లిఫ్టర్), బంగారు ఉష (వెయిట్ లిఫ్టర్), కె.రమణ (వెయిట్ లిఫ్టర్), ఆర్.మౌనిక (టెన్నికాయిట్), పి.నరసయ్య (ఖోఖో), ఎం.భువన (బీచ్ కబడ్డీ) క్రీడాకారులను సన్మానించారు. క్రీడలపరంగా ఉత్తమంగా ఎంపికై న ఆరికతోట జెడ్పీ ఉన్నత పాఠశాల, జెడ్పీ స్కూల్ పిరిడి, కస్పా మున్సిపల్ ఉన్నత పాఠశాల, బాడంగి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, సిరిపురం జెడ్పీ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులను, హెడ్ మాస్టర్లను జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు.

పీడీలు, హెచ్‌ఎంలకు జ్ఞాపికలు

వివిధ క్రీడా విభాగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు ఎంపికై న కోచ్‌లను, వివిధ పోటీల విజేతలను, మారథాన్ రన్ విజేతలను, పలువురు క్రీడాకారులను అభినందించి జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ తిరుమలరావు, జిల్లా క్రీడాధికారి వెంకటేశ్వర రావు, పలువురు కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆగిపోయిన మొబైల్ ఐసీటీసీ సేవలు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి మార్చురీ వద్ద నిరుపయోగంగా ఉన్న మొబైల్ ఐసీటీసీ వాహనం

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ మహమ్మారి నిర్మూలనలో అత్యంత కీలక పాత్ర వహించే మొబైల్ ఐసీటీసీ వాహనం సేవలు నిలిచిపోయాయి. గ్రామాలకు వెళ్లి హెచ్ఐవీపై అవగాహన కల్పించడంతో పాటు పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని తగ్గించాలనే ఉద్దేశంతో మొబైల్ ఐసీటీసీ సేవల (సంచార సమగ్ర అవగాహన, పరీక్షా కేంద్రం)ను ఏర్పాటు చేశారు. అయితే కొద్ది నెలలుగా ఈ సేవలు నిలిచిపోవడంతో మొబైల్ ఐసీటీసీ వాహనాన్ని మూలన పెట్టేశారు.

హెచ్ఐవీ వ్యాప్తి ఉన్న గ్రామాల్లో పరీక్షలు

హెచ్ఐవీ వ్యాప్తి అధికంగా ఉన్న గ్రామాలకు వెళ్లడానికి నెలకు సరిపడా ప్రణాళికను సిబ్బంది రూపొందించుకునేవారు. ప్రణాళిక ప్రకారం రోజుకు ఒక గ్రామానికి వెళ్లేవారు. అ గ్రామంలో ముందుగా హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించి వ్యాధి లక్షణాల గురించి తెలియజేసేవారు. పరీక్షలు చేయించుకోవాలనే వారికి వాహనంలోనే చేసేవారు. వాహనంలో ల్యాబ్‌టెక్నీషియన్, కౌన్సిలర్ డ్రైవర్ ఉండేవారు. ల్యాబ్ టెక్నీషియన్ హెచ్ఐవీ పరీక్షలు చేయగా, కౌన్సిలర్ వ్యాధిపై అవగాహన కల్పించేవారు. అక్కడ ఎవరికైనా హెచ్ఐవీ నిర్ధారణ అయితే వారిని జిల్లా కేంద్రంలో ఉన్న ఏఆర్‌టీ సెంటర్‌కు పంపించేవారు. ఏఆర్‌టీ సెంటర్‌లో వారికి సీడీఫోర్ కౌంట్ పరీక్ష నిర్వహించి కౌంట్ తక్కువగా ఉన్న వారికి ఏఆర్‌టీ మందులు అందించేవారు.



హెచ్ఐవీ పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

ఏఆర్‌టీ సెంటర్‌లో 8,125 మంది రిజిస్టర్ కాగా వారిలో పురుషులు 3,382 మంది, మహిళలు 4,412, పిల్లలు 315 మంది ఉన్నారు.

సర్వజన ఆస్పత్రిలో వాహనం

మొబైల్ ఐసీటీసీ సేవలు జిల్లాలో నిలిచిపోగా ఐదు నెలలుగా ఆ వాహనం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి మార్చురీ వద్ద నిలిపివేశారు. వాహనం వెళ్లకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో హెచ్ఐవీ పరీక్షలు నిలిచిపోయాయి. ఏవైనా శస్త్రచికిత్సలు, చికిత్స పొందడానికి రోగులు ఆస్పత్రికి వస్తే అక్కడ వారికి హెచ్ఐవీ పరీక్ష చేస్తున్నారు.

జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు

విజయనగరం అర్బన్: చెన్నైలో ఈ నెల 25న జరిగిన జాతీయ కెన్యురియు చాంపియన్ షిప్ కరాటే పోటీలలో పట్టణానికి చెందిన సత్యడిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవ మణి గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పతకాలు సాధించిన వారిలో పి.కుశ్వంత్‌కుమార్ (కాటా కేటగిరి, కుమితీ కేటగిరిలో బంగారు పతకం), కె.శివకుమార్ (కాటాలో బంగారు, కుమిటీలో రజత పతకం), పి.హేమంత్ (కాటాలో బంగారు, కుమిటీలో బంగారు పతకం) ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలు, కోచ్ సంతోష్‌కుమార్‌ను కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణ రావు అభినందించారు.

డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలను రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) నిర్వహిస్తుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆర్‌బీఐ స్థాపించి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారని చెబుతూ దీనికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏ కళాశాల నుంచైనా విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌బీఐ90క్విజ్.ఇన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు బృందంగా ఏర్పడి కూడా క్విజ్ పోటీలో నమోదు కావచ్చని, బృందంలో కనీసం ఇద్దరు విద్యార్థులు ఉండాలని స్పష్టం చేశారు. పోటీలు స్టేట్‌రౌండ్, జోనల్‌స్థాయి, జాతీయస్థాయిలో జరుగుతాయని తెలిపారు. మొదటి స్థాయిలో స్టేట్ రౌండ్‌లో మొదటి బహుమతి రూ.2 లక్షలు, రెండవ బహుమతి రూ.1.50 లక్షలు, మూడవ బహుమతి రూ.1 లక్ష ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే జోనల్ స్థాయిలో మొదటి బహుమతి రూ.5 లక్షలు, రెండవ బహుమతి రూ.4 లక్షలు, మూడవ బహుమతి రూ.3 లక్షలు ఇవ్వనున్నారన్నారు. జాతీయస్థాయిలో జరిగే తుది పోటీలలో మొదటి బహుమతి రూ.10 లక్షలు, రెండవ బహుమతి రూ.8 లక్షలు, మూడవ బహుమతి రూ.6 లక్షలు ప్రదానం చేస్తారని తెలిపారు.

సెప్టెంబర్ 17లోపు రిజిస్ట్రేషన్

జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ జేఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లను సెప్టెంబర్ 17వ తేదీ లోపు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. దరఖాస్తు రిజిస్ట్రేషన్ కోసం ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదని, ఈ అవకాశాన్ని డిగ్రీ చదివే విద్యార్థులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు అధికారి ఎస్ఎస్.శోభిక, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై . సత్యం నాయుడు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయి కుమార్, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ. కరుణాకర్, పార్వతీపురం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎ.మురళీధర్, నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి డీఎస్.దినేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీ పనులు వేగవంతం చేయండి

విజయనగరం అర్బన్: మెంటాడ మండల పరిసరాల్లో తలపెట్టిన గిరిజన యూనివర్సిటీ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. అప్రోచ్ రోడ్డు, విద్యుత్, నీటి సరఫరా తదితర మౌలిక వసతుల కల్పన పనుల అంచనాలను సంబంధిత శాఖల అధికారులు రెండు రోజుల్లో సమర్పించాలని సూచించారు. మార్చి 2025లో తరగతి గదులు ప్రారంభించాల్సి ఉన్నందున నిధులు మంజూరైన మర్నాడే పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. తన చాంబర్‌లో గిరిజన వర్సిటీ పనులపై గురువారం సమీక్షించారు. భూసేకరణ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించాలని, కోర్టులో ఉన్న 3 ఎకరాల భూ సమస్య పరిష్కారానికి కక్షిదారులతో మాట్లాడి ఒప్పించాలని బొబ్బిలి ఆర్డీఓ సుధారాణికి సూచించారు. ఆక్రమణలో ఉన్న భూ వివరాలు, భూసేకరణకు ఎంత మొత్తం అవసరం అవుతుంది తదితర వివరాలు అందజేయాలని కోరారు. అప్రోచ్ రోడ్డు భూ వివాదం పరిష్కారం కాకపోతే అలైన్మెంట్ మార్చేందుకు ఉన్న వీలును పరిశీలించాలని ఆర్అండ్‌బీ ఎస్ఈ విజయ్‌రత్నంకు సూచించారు. భూ సమస్య తీరగానే సెప్టెంబర్ 15 నుంచి రహదారి పనులను ప్రారంభించాలన్నారు. నీటి సరఫరాకు సంబంధించి రూ.6 కోట్ల విలువైన పనులను చేపట్టాల్సి ఉండగా, ఇప్పటికే 50 శాతం వరకు పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తికి అవసరమైన బిల్లుల కోసం ప్రతిపాదనలు పంపాలని ఎస్ఈ ఉమాశంకర్‌కు ఆదేశించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి, సర్వీస్ కనెక్షన్‌కు అవసరమైన నిధుల కోసం వెంటనే అంచనాలను పంపాలని ఎస్ఈ లక్ష్మణరావుకు తెలిపారు. సంబంధిత అధికారులంతా తమ అంచనాలను పంపి మ్యాన్‌పవర్‌తో పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవసరం

- నాబార్డు ఏజీఎం టి.నాగార్జున



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగార్జున

గంట్యాడ: మహిళలు ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని నాబార్డు ఏజీఎం టి.నాగార్జున అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం 'మహిళల ఆర్థిక అక్షరాస్యత' అనే అంశంపై గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. డిజిటల్ లావాదేవీల్లో జరుగుతున్న మోసాలను మహిళలు తెలుసుకోవాలన్నారు. ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడే యూనిట్లు నెలకొల్పాలన్నారు. వెలుగు ఏపీడీ సావిత్రి మాట్లాడుతూ సంఘ సభ్యులు తమ పొదుపును ముందుగా అంతర్గ అప్పుగా వాడుకోవాలని సూచించారు. అవసరం మేరకు రుణాలకు దరఖాస్తు చేయాని, సుస్థిరమైన జీవనోపాధులు ఏర్పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ మూర్తి, ఏపీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌లో చదవడం అసాధారణ అవకాశం



శాతవాహన బాలికల వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న కమోడోర్ రాజేష్‌కుమార్ శర్మ

- కమోడోర్ రాజేష్‌కుమార్ శర్మ
- స్కూల్‌లో శాతవాహన బాలికల వసతిగృహం ప్రారంభం

విజయనగరం: సైనిక్ స్కూల్స్ సొసైటీకి చెందిన ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్ కమోడోర్ రాజేష్ కుమార్ శర్మ గురువారం విజయనగరం మండలంలోని కోరుకొండలో గల సైనిక్ స్కూల్‌ను సమగ్రంగా తనిఖీ చేశారు. దేశంలోని అన్ని సైనిక్ స్కూల్స్ వార్షిక తనిఖీలో భాగంగా మూడు రోజుల పాటు చేపట్టిన తనిఖీలు బుధవారం ముగిశాయి. ముందుగా దేశం కోసం త్యాగం చేసిన వీర జవాన్‌లకు నివాళులు అర్పిస్తూ వార్ మెమోరియల్ వద్ద ఆయన పుష్పాంజలి ఘటించారు. అనంతరం క్యాడెట్లు అందించిన గార్డ్ ఆఫ్ హానర్ ఆకట్టుకుంది. తదనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక అసెంబ్లీలో క్యాడెట్లు, సిబ్బందిని ఉద్దేశించి రాజేష్‌కుమార్ శర్మ ప్రసంగించారు, భారతదేశ విద్యారంగంలో సైనిక్ పాఠశాలల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కోరుకొండలోని సైనిక్ స్కూల్‌లో క్యాడెట్‌గా ఉండడం అసాధారణమైన అవకాశంగా గుర్తించాలని చెప్పారు. క్రమశిక్షణ, ధైర్యం, అంకితభావం విలువలను అందరూ స్వీకరించాలని పిలుపునిచ్చారు. క్యాడెట్ హౌస్‌లు, స్విమ్మింగ్ పూల్, మోటివేషనల్ హాల్, మ్యూజియం, ఇన్‌స్ట్రక్షన్ బ్లాక్‌లతో సహా పాఠశాల సౌకర్యాలను విస్తృతంగా తనిఖీ చేశానని చెప్పారు. అనంతరం కమోడోర్ ఆర్‌కే శర్మ కొత్తగా నిర్మించిన శాతవాహన బాలికల వసతి గృహాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్/వింగ్ కమాండర్ అభిలాష్ బాలచంద్రన్ పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభను వెలికితీయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల్లో ఇమిడి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి వెలికితీయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలను స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తన ఆట ప్రదర్శనతో భారత దేశానికి అపారమైన కీర్తిని, ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించిన క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ అని కొనియాడారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ క్రీడాల్లోనూ రాణించి జాతీయ స్థాయిలో పేరు, ప్రఖ్యాతులు సాధించవచ్చన్నారు. క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములు సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని హితవు పలికారు. అనంతరం నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో కురుపాం నియోజవర్గం ప్రథమస్థానం, సాలూరు నియోజక వర్గం ద్వితీయ స్థానం కై వసం చేసుకున్నాయి. ఆర్చరీ (విలు విద్య) పోటీల పలు విభాగల్లో కాంపౌండ్ బాయ్స్ విభాగంలో పి.లోకేష్ ప్రథమ స్థానం, చేతన్ స్వరూప్ ద్వితీయం, కాంపౌండ్ గర్ల్స్ జి.తన్విక, జి.తనీషా, రికర్వ్ బాయ్స్ ఎ.కల్యాణ్, ఎన్.జయంత్, బి ఫణీంద్ర, రీకర్వ్ గర్ల్స్ పి.త్రివేణి, ఎన్.హేమన్య, ఇండియన్ బాయ్స్ డి.పవన్ కుమార్, జె.దేవిప్రసాద్, ఇండియన్ గర్ల్స్ ఎస్.అఖిల, బి ప్రియలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

క్రీడాకారులకు సన్మానం

అనంతరం 2023-24 సంవత్సరం క్రీడా ప్రతిభ అవార్డులను కలెక్టర్, ఎమ్మెల్యే బహూకరించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను సన్మానించారు. ప్రతిభా అవార్డుల్లో ఉల్లిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, పాచిపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం, సాలూరు మండలంలోని పురోహితుని వలస ఏపీఎంఎస్ తృతీయ స్థానం, కొత్త గూడ జీటీడబ్ల్యూఏ ఉన్నత పాఠశాల నాల్గవ స్థానం, నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఐదవ స్థానం సాధించాయి. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి జి.పగడాలమ్మ, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డీటీ గాంధీ, పీఈటీల సంఘం అధ్యక్షుడు ఎం.రామ కృష్ణ, కార్యదర్శి ఎం.మురళీకృష్ణ, వీడీఎస్ కె.తిరుపతి రావు, క్రీడాకారులు, తదితరులు, పాల్గొన్నారు.

తెలుగు భాషను పరిరక్షించుకుందాం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపు



గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, సిబ్బంది

విజయనగరం: అన్ని భాషల్లో గొప్పదైన తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గిడుగు వెంకట రామమూర్తి పంతులు, మహాకవి గురజాడ అప్పారావు చిత్ర పటాలకు జెడ్పీ కార్యాలయంలో గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగులెస్స అని శ్రీకృష్ణదేవరాయలు కీర్తించగా, గ్రాంధిక భాషగా ఉన్న తెలుగును వ్యవహారిక భాషగా సామాన్యుల చెంతకు చేర్చిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిపాలనా భాషగా తెలుగు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ వ్యవహారాల నిర్వహణలో తెలుగుభాషకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఎంతో గొప్పదైన మన తెలుగు భాషను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాషను ఎంతో ఉన్నతస్థితికి తీసుకువెళ్లిన గిడుగు రామ్మూర్తిని స్మరించుకోవడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.సేతుమాధవన్, డిప్యూటీ కలెక్టర్ సుమబాల, జిల్లా అధికారులు సుధాకర్, డి.రమేష్, త్రివిక్రమ రావు, సాహితీవేత్త జక్కు రామకృష్ణ, సీనియర్ జర్నలిస్టు ఎలిశెట్టి సురేష్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ దేవ్‌ప్రసాద్, డివిజనల్ పీఆర్‌ఓ ఎస్.జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

- జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం యూనివర్సిటీలో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత గిడుగు రామమూర్తి చిత్రపటానికి వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ జాస్తి ఆనంద్ చందూలాల్ మాట్లాడుతూ మాతృభాషను మర్చిపోకూడదని, ప్రపంచంలో ఉన్న భాషలు తెలుగు భాష నుంచి ఉద్భవించినవే నన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జె.నాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎం.హేమ, డాక్టర్ ఎం.సౌభాగ్యలక్ష్మి, ఆర్‌డీడీపీ శివరాం, వివిధ విభాగాల అధిపతులు, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.